క్లుప్తంగా

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం


అల్‌బెండజోల్ మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది

పుల్లలచెరువు: వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులు దరిచేరకుండా చేయవచ్చని సీహెచ్‌ఓ బాష అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 19 సంవత్సరాలలోపు అందరికీ డీవార్మింగ్ మాత్రలు మింగించినట్లు సీహెచ్‌ఓ బాష తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుల్లలచెరువు ప్రభుత్వ వైద్యశాల పరిధిలో మొత్తం విద్యార్థులు 6,100 మంది ఉండగా నేడు 5,984 మంది విద్యార్థులతో మాత్రలు మింగించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు భోజనం చేసే సమయంలో చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని చెప్పారు. గోళ్లు పెరగకుండా చూసుకోవాలన్నారు.

పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం


బేతేలుపురంలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

దొనకొండ: గర్భిణులు, బాలింతలు సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటూ రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, ఇతర వ్యాధులు దూరంగా ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి, సీహెచ్‌ఓ ఇన్నాసమ్మ తెలిపారు. మండలంలోని గంగదేవిపల్లి, బేతేలుపురం-2 అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. వైద్యపరంగా పలు సూచనలు, సలహాలందించారు. అనంతరం గర్భిణులకు సీమంతం, పిల్లలకు అక్షరాభ్యాసం చేశారు. గ్రామంలో ర్యాలీ చేశారు. కార్యకర్తలు ఆదిలక్ష్మి, జయమణి, స్వరాజ్యలక్ష్మి, ఎస్.పద్మ, ఎస్.రవణమ్మ, నిర్మల, ఆయాలు పాల్గొన్నారు.

సీఐగా బాధ్యతలు చేపట్టిన అసాన్

త్రిపురాంతకం: త్రిపురాంతకం సిఐగ జి అసాన్ నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రమోషన్ తీసుకుని గుంటూరు జిల్లా నుండి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన సిఐ సుబ్బారావు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సిఐ అసాన్‌ను పలువురుకలిసి శుభాకాంక్షలు తెలిపారు. సిబ్బందితో ఆయన సమావేశం అయ్యారు.


దర్శి గడియారం స్తంభం సెంటర్‌లో పోలీసులు


జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను హౌస్ అరెస్టు చేస్తున్నట్లు నోటీస్ ఇస్తున్న మహిళా పోలీసులు


ఎమ్మెల్యే బూచేపల్లికి హౌస్ అరెస్టు నోటీస్ ఇస్తున్న పోలీసులు

అరాచకాలకు కేరాఫ్ దర్శి

- ఎస్సై, సీఐల తీరుపై ఎమ్మెల్యే బూచేపల్లి ఆగ్రహం
- మంగళవారం నిరసనకు పిలుపు ఇచ్చిన వైఎస్సార్ సీపీ
- 144 సెక్షన్ పేరుతో నిరసనను అడ్డుకునే కుట్ర
- దర్శి నియోజకవర్గంలో నాయకుల హౌస్ అరెస్టులు
- మండల శివార్లలో కార్యకర్తలను వెనక్కి పంపిన పోలీసులు
- అయినా పట్టణానికి భారీగా చేరుకున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- తెల్లవారు జామునే ఎమ్మెల్యే బూచేపల్లి హౌస్ అరెస్టు


వైఎస్సార్ సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి


దర్శిలో కవాతు చేస్తున్న పోలీసులు

దర్శి: అరాచకాలు, దాడులు పోలీసుల దౌర్జన్యాలకు కేరాఫ్ అడ్రస్‌గా దర్శి నియోజకవర్గం మారిందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై జరుగుతున్న దాడులు, అరాచకాలకు నిరసనగా దర్శిలో శాతియుతంగా మంగళవారం నిరసన చేపట్టారు. టీడీపీ నేతలు, పోలీసులు ఆ నిరసనను ఎలాగైనా అడ్డుకోవాలని హైడ్రామాకు తెరలేపారు. రాత్రికి రాత్రే టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి ఫిర్యాదుతో సీఐ కార్యాలయానికి వెళ్లారు. సీఐతో మంతనాలు జరిపి ఒక పథకం ప్రకారం నిరసనను అడ్డుకునే కుట్రకు తెల్లవారే సరికి తెరలేపారు. పట్టణంలో 144 సెక్షన్ విధించారు. తెల్లవారు జామునే జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలను హౌస్ అరెస్ట్ చేస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు. వారు ఇంటి నుంచి బయటకు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. పట్టణంలో వందలాది మంది పోలీసులతో కవాతు చేశారు. కురిచేడు రోడ్డు, అద్దంకి రోడ్డు, పొదిలి రోడ్డు, లంకోజనపల్లి రోడ్డు, తూర్పు చౌటపాలెం రోడ్డు, తూర్పు గంగవరం రోడ్డుల నుంచి వచ్చే వేలాది మంది నాయకులు, కార్యకర్తలను అడ్డుకుని వెనక్కు పంపారు. కొందరిని వారి వారి నివాసాల్లోనే హౌస్ అరెస్టులు చేసి నిర్బంధించారు. పట్టణంలో పలు అవసరాలకు రోడ్డు పైకి వచ్చే వారిని కూడా రానివ్వకుండా అడ్డుకున్నారు.

ప్లకార్డులతో నిరసన

వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలపై ఎస్సై, సీఐల వేధింపులు వెంటనే ఆపివేయాలని ప్లకార్డులు చేత బట్టి నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సీఐ, ఎస్సైలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కార్యకర్తలు చేసిన నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తనపై దాడి చేసిన వ్యక్తిపై ఫిర్యాదు తానే స్వయంగా ఇస్తే అరెస్టు చేయకుండా దాడి చేస్తున్నప్పుడు అడ్డు వచ్చిన అంజిరెడ్డి అనే వ్యక్తిపై దాడి చేసిన వ్యక్తి ఫిర్యాదు చేశాడని కేసు నమోదు చేశారన్నారు. అంజిరెడ్డిని రాత్రంతా పోలీసులు పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచి కొట్టి చిత్రహింసలకు గురి చేశారని, అతను ఇప్పుడు చావుబతుకుల్లో ఉన్నాడని బూచేపల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఆగష్టు 15వ తేదీన ఎమ్మెల్యేగా తాను జెండా ఎగుర వేయాల్సి ఉంటే కనీసం పిలవలేదని మండిపడ్డారు. ఈ విషయాలన్నీ అసెంబ్లీలో ప్రివిలేజ్ కమిటీ దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు. ఇకపై వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలపై అక్రమ కేసులు పెట్టినా, తమ వారిపై అన్యాయంగా లాఠీలు ఝులిపించాలని చూసినా చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. తమ నాయకుడు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ ఆధ్వర్యంలో దర్శిలో భారీ పెద్ద ఎత్తున ధర్నా చేసేందుకు వెనకాడేది లేదని ఎమ్మెల్యే బూచేపల్లి హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, తాళ్లూరు మండల కన్వీనర్ తూము వెంకట సుబ్బారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, జిల్లా యూత్ అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ మాజీ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, జెడ్పీటీసీలు తాతపూడి రత్నరాజు, నుసుం నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డి, జేసీఎస్ మాజీ కన్వీనర్ మేడికొండ జయంతి, ముండ్లమూరు మాజీ మండల కన్వీనర్ సూదిదేవర అంజయ్య, మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, కొల్లా ఉదయభాస్కర్, మజ్జువలి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధాలతో వైఎస్సార్ సీపీని అడ్డుకోలేరు

తాళ్లూరు (దర్శి): ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపే హక్కులను కాలరాస్తూ నిర్బంధాలతో వైఎస్సార్ సీపీని అడ్డుకోలేరని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పోలీసులను హెచ్చరించారు. మంగళవారం దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు దర్శి పోలీసుస్టేషన్ వద్ద నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు వీల్లేకుండా ఆ పార్టీ నాయకులను, ప్రజాప్రతినిధులను, కార్యకర్తలను ఎక్కడికక్కడ అడ్డుకోవడం హేయమైన చర్య అని తెలిపారు. తాళ్లూరు మండలానికి చెందిన జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీలు పోశం మధుసూదన్‌రెడ్డి, గోళ్లపాటి మోషే, మండల పార్టీ అధ్యక్షుడు తూము వెంకటసుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ ఎడమకంటి వెంకటేశ్వరరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె లతీఫ్, మాజీ జెడ్పీటీసీ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పులి బ్రహ్మారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కరిముల్లా, ఎస్‌కే వలిలతో పాటు మరో పది మందికి, ముండ్లమూరు మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మారెడ్డి, జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, సర్పంచ్‌ల సంఘ మండల మాజీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు సూదిదేవర అంజయ్య, నాయకులు బంకా నాగిరెడ్డి, గొంది వెంకటప్పారెడ్డి, భిక్షాలురెడ్డి, మేడగం వెంకటరమణారెడ్డి, జనమాల పిచ్చయ్యలతో పాటు మరో పదిహేను మందికిపైగా పోలీసులు నోటీసులు జారీ చేసి గృహ నిర్బంధం చేశారు. **కురిచేడు:** దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తలపెట్టిన శాంతియుత నిరసనకు కురిచేడు మండలం నుంచి తరలి వెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులపై పోలీసుల దమనకాండ తగదని ఆ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం దర్శి వెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులను అడుగడుగునా అడ్డుకోవడంతో పాటు గృహనిర్బంధాలు చేశారు. మరి కొందరిని మార్గమధ్యంలో అడ్డుకొని వెనక్కి పంపారు. జెడ్పీటీసీ నుసుం వెంకటనాగిరెడ్డికి నోటీసులు ఇచ్చేలోపు దర్శి చేరుకోవడంతో ఆయనకి ఇవ్వలేదు. జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ సైదా, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ ఎం.పిచ్చిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఎం. సుబ్బారెడ్డి, కాశీపురం మాజీ సర్పంచ్ ఎస్. నాసరయ్యలను ఎస్‌ఐ శివ కురిచేడు– పెనగమూరు గ్రామాల మధ్య అడ్డుకున్నారు. మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కె. గంగయ్య, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎన్.రాజయ్య, ఎంపీటీసీలు వెంకటనరసయ్య, కె.శివారెడ్డి, సర్పంచ్ కె.కృష్ణయ్య, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ పి. నాగిరెడ్డి, ఊట్ల వెంకటేశ్వర్లులకు నోటీసులు ఇచ్చారు.

దొనకొండ: పోలీసులు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారని, ఆ కేసులను ఎత్తివేయాలని, బొట్లపాడులో ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి కారుపై టీడీపీ వారు దాడి చేస్తే దర్శి ఎస్‌ఐ మురళీ టీడీపీ వారిపై కాకుండా వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేయడం సిగ్గుచేటని మాజీ జెడ్పీటీసీ, జిల్లా యూత్ అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, దొనకొండ మాజీ సర్పంచి కర్నాటి ఆంజనేయరెడ్డి మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడి ప్రజల సంక్షేమం కోరే పోలీసులు అరాచాకాలకు పాల్పడి టీడీపీకి కొమ్ము కాస్తున్నారని, పోలీస్‌స్టేషన్‌కు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు వెళ్తే బూతు మాటలు మాట్లాడి బయటకు వెళ్లమని, పచ్చ చొక్కా వారికి కుర్చీ వేసి కూర్చో బెడుతున్నారని ధ్వజమెత్తారు.


ముండ్లమూరు: పోలీసుల నిర్బంధంలో ఉన్న సుంకర బ్రహ్మారెడ్డి


తాళ్లూరు జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి..


దర్శి వెళ్తున్న నాయకులను మధ్యలో అడ్డుకుంటున్న పోలీసులు

వైభవంగా విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇస్తున్న వీరబ్రహ్మేంద్ర స్వామి


అగ్నిహోమం నిర్వహిస్తున్న భక్తులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మంగళవారం విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు భారీగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల వేద మంత్రాల నడుమ యజ్ఞాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గణపతి పూజ, విశ్వకర్మ వ్రతం, జెండా ఆవిష్కరణ అర్చకుల వేద మంత్రోచ్చరణల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం చేశారు. అనంతరం సాయంత్రం మండలంలోని ప్రధాన వీధుల నుంచి గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు, ఈ సందర్భంగా సుదూర ప్రాంతాల్లో నివసిస్తున్న పట్టణానికి సంబంధించిన బంధుమిత్రులు, రక్త సంబంధీకులు కార్యక్రమానికి భారీగా హాజరు కావటంతో మండల కేంద్రంలో సందడి వాతావరణం నెలకొంది. పూజాది కార్యక్రమంలో ముత్తులూరి ఉమామహేశ్వరాచారి దంపతులు, రంగోజి నాగాచారి దంపతులు, కమిటీ సభ్యులు ముత్తులూరి శివశంకరాచారి, గురిజేపల్లి శ్రీనివాసాచారి, శీలవంతుల బ్రహ్మం, బొడ్డోజు నాగేశ్వరాచారి, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని కార్యక్రమాలను పర్యవేక్షించారు.

యర్రగొండపాలెం: శ్రీమద్విరాట్ విశ్వకర్మ భగవానుని విశ్వశాంతి మహా యజ్ఞ మహోత్సం మంగళవారం ఘనంగా జరిగింది. స్థానిక పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దంపతులు హోమంలో పాల్గొన్నారు. వడ్లమాను గోవర్ధనాచారి సిద్ధాంతి ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించి విశ్వశాంతి మహా యజ్ఞ మహోత్సవం నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారిని నగరోత్సవం జరిపారు.

వైభవంగా బొజ్జ గణపయ్య నిమజ్జనం


వేలంలో లడ్డూ రూ.లక్షకు పాడుకున్న నలంద హైస్కూల్ యాజమాన్యం


రూ.95 వేలకు పాడుకున్న కలశంతో వెంకటరెడ్డి దంపతులు

- రూ.లక్ష పలికిన లడ్డూ, రూ.95 వేలకు కలశం

యర్రగొండపాలెం: వినాయక చవితి సందర్భంగా యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో స్థానిక కొలుకుల సెంటర్‌లో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక స్వామిని మంగళవారం అంగరంగ వైభవంగా నిమజ్జనానికి తరలించారు. పది రోజులుగా భక్తులను అలరించిన స్వామివారిని 11వ రోజు వేలాది మంది భక్తులు ఘనంగా పూజలు చేసి పట్టణంలో పెద్ద ఎత్తున ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలతో ఏర్పాటు చేసిన కోలాటం ఆకర్శించింది. ముందుగా 11 రోజుల విఘ్నేశ్వరిడితో పాటు పూజలు అందుకున్న వివిధ వస్తువులను నిర్వాహకులు వేలం వేశారు. ఈ వేలంలో లడ్డూ స్థానిక నలంద హైస్కూల్ యాజమాన్యం (మేకల రామకృష్ణారెడ్డి) రూ.లక్ష, ప్రధాన కలశం మురారిపల్లెకు చెందిన కైపు వెంకటరెడ్డి రూ.95 వేలు, నక్కా వెంకటేశ్వర్లు అకౌంట్ పుస్తకాలు రూ. 40వేలు, పేరం రమణారెడ్డి పెన్ను రూ.21 వేలు, కందూరి ప్రసాద్ చిన్న లడ్డూ రూ.2300, లగడపాటి ఆదిలక్ష్మి యాపిల్ రూ.1200 ప్రకారం వేలంపాటలో పాడుకున్నారు. మిగిలిన పూజా సామగ్రిని భక్తులు రూ. 2.50 లక్షలకు సొంతం చేసుకున్నారని నిర్వాహకులు తెలిపారు. స్వామివారిని అనునిత్యం ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించిన పూజారి రామయ్యను భక్తులు ఘనంగా సన్మానించారు. బొజ్జ గణపయ్యను త్రిపురాంతకం మండలం దూపాడుకు సమీపంలో ఉన్న నాగార్జున సాగర్ కాలువలో నిమజ్జనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో నిర్వాహకులు బిజ్జం రమణారెడ్డి, పి.నందిరెడ్డి, ఎ.కిష్టయ్య, వై.భాగ్యారావు, కె.ఓబులరెడ్డి, సి.అంకిరెడ్డి, వి.సాయిరెడ్డి, పి.ప్రసాద్ పాల్గొన్నారు.

మానవాళిని కాపాడేది

ఓజోన్ పొర

దర్శి: మానవాళిని కాపాడేది ఓజోన్ పొర మాత్రమేనని, దాన్ని రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వీ రమణ అన్నారు. స్థానిక ఆ కళాశాలలో ఓజోన్ డే సందర్భంగా ఓజోన్ పొరపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌వీ రమణ మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా మాత్రమే పర్యావరణ పరిరక్షణ జరిగి ఓజోన్ పొరను కాపాడుకోగలమని చెప్పారు. రసాయన శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ఎస్.రామచంద్రయ్య మాట్లాడుతూ అతినీల లోహిత కిరణాలు భూమిపై పడకుండా ఓజోన్ పొర కాపాడుతుందన్నారు. క్లోరోఫోరో కార్బన్ విడుదల చేసే పరికరాలను తగ్గించుకోవాలన్నారు. సంఘ సేవకులు జీవీ రత్నం, అధ్యాపకులు డాక్టర్ కె.నరేష్, ఎస్.నగేష్, కె.ప్రభుదాస్, ఎల్.రమేష్‌బాబు, సీహెచ్ ప్రవీణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌వీ రమణ

స్వచ్ఛ భారత్‌లో భాగస్వాములు కావాలి


త్రిపురాంతకం: స్వచ్ఛ భారత్ ర్యాలీకి హాజరైన విద్యార్థులు, ప్రజాప్రతినిధులు

త్రిపురాంతకం: స్వచ్ఛ భారత్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. మండలంలో స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో పచ్చదనం, పర్యావరణానికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ వరప్రసాద్, ఎంఈఓ-2, రాజశేఖరరెడి, సర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. గొల్లపల్లిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ వెంకట తిరుమలయ్య, తిరుపతయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలనతో ఆరోగ్యం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఏఎన్‌ఎం నాగలక్ష్మి నులి పురుగుల నివారణకు పలు సూచలను చేశారు. రోజూ చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. చేతుల శుభ్రతపై పద్ధతులను విద్యార్థులకు వివరించారు. అనంతరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సావిత్రి విద్యార్థులులతో ఆల్‌బెండాజోల్ మాత్రలు మింగించారు. అధ్యాపకులు విజయబాబు, శ్రీనివాసాచార్యులు, అక్రమ్ పాల్గొన్నారు.


పెద్దదోర్నాల విద్యార్థులకు మాత్రలు మింగిస్తున్న ప్రిన్సిపాల్

జీఓ నంబర్-85ను రద్దు చేయాలి


విజయవాడ నిరసనకు హాజరైన వైద్యాధికారులు

తాళ్లూరు (దర్శి): రాష్ట్ర ప్రభుత్వం వైద్యుల హక్కులను కాలరాసేలా విడుదల చేసిన జీఓ నంబర్-85ను వెంటనే ఉపసంహరించుకోవాలని వైద్యాధికారి ఖాదర్ మస్తాన్‌బీ కోరారు. జీఓ నంబర్‌ను రద్దు చేయాలని కోరుతూ వైద్యులు తలపెట్టిన చలో విజయవాడకు తాళ్లూరు, తూర్పుగంగవరం వైద్యులు తరలి వెళ్లడంతో ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పూర్తిగా వైద్యసేవలు నిలిచిపోయాయి. వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న వైద్యులకు కనీస వేతనాలు, పదోన్నతులు, ట్రైబల్ అలవెన్స్, ఇతర ముఖ్యమైన సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకూ తమ నిరసనలు ఆగవని హెచ్చరించారు.

ఈ-క్రాప్ నమోదు గడువు పొడిగింపు


చట్లమిట్లలో ఈకేవైసీని పరిశీలిస్తున్న ఏఓ బుజ్జిబాయి

పుల్లలచెరువు: ఖరీఫ్ సీజన్‌లో ఈ-క్రాప్ నమోదుకు ఈ నెల 30వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు వ్యవసాయాధికారి నిర్మలాదేవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదుకు అదివారం గడువు ముగియడంతో ప్రభుత్వం 30వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. రైతులు తప్పని సరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకోకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే బీమా, పథకాలు అందవన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, వీఆర్వోలు త్వరగా నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు.

పెద్దారవీడు: పంట నమోదుకు చేయించుకున్న ప్రతి రైతు ఈకేవైసీ తప్పనిసరిగా వేయాలని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి సూచించారు. మండలంలో తోకపల్లి, చట్లమిట్ల, గొబ్బూరు, బోయిదగుంపుల గ్రామాల్లో ఈకేవైసీని ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల నమోదు చేయించుకున్న రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ వేయాలని, ఈ నెల 25వ తేదీలోపు చేయించుకోవాలని సూచించారు. ఈకేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకుల వద్దకు వెళ్లి రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు.